

పార్కు స్థలాన్ని కాపాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

శ్రీపురం కాలనీ పార్కు స్థలాన్ని కాపాడండి

వనస్థలిపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీపురం కాలనీకి చెందిన పార్కు స్థలాన్ని కొంతమంది వ్యక్తులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని, ఆ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను రద్దు చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. ఈ మేరకు కార్పొరేటర్ మంగళవారం మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీకి కేటాయించిన పార్కు స్థలాన్ని కొంతమంది నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఇతరులకు విక్రయించారని తెలిపారు. ఆ స్థలం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను రద్దు చేయాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీపురం కాలనీవాసులు పాల్గొన్నారు.



జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

దశలవారీగా రోడ్లు, పార్కుల అభివృద్ధి

ఎల్బీనగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దశలవారీగా ప్రతి రోడ్డు, పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో ఆహ్లాదం అందించడంతో పాటు పిల్లలు ఆడుకునేలా రూ. 18 లక్షలతో చేపట్టనున్న ప్లే పార్కు నిర్మాణ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం అపార్ట్‌మెంట్స్‌లో కలియదిరిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల కోసం ప్లే పార్కు, స్లైడ్‌స్వింగ్స్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తూ జనప్రియ అపార్ట్‌మెంట్స్‌ను ఆదర్శ అపార్ట్‌మెంట్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కాలనీని శుభ్రంగా ఉంచుకోవడం, రోడ్లపై చెత్త వేయకుండా చూసుకోవడం స్థానికుల బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, సభ్యులు జ్యోతిరెడ్డి, కళ, శాంత, మానసా, నవీత, అరుణ, అనురాధ, యశోద తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ ఆటోసాయినగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు. ఆటోసాయినగర్‌లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేటర్ కాలనీలో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.



పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి నరసింహాగౌడ్ తదితరులు

గౌరెల్లిలో మొక్కలు నాటిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ గౌరెల్లి గ్రామంలో నగరంలోని ప్రగతి మహా విద్యాలయం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరం కొనసాగుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి నరసింహాగౌడ్, సెక్రెటరీ శేషాద్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మొక్కలను నాటారు. గుడ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. వారం రోజుల పాటు గ్రామంలో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి.శోభారాణి తెలిపారు.

నేటి నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పశువైద్యాధికారి డాక్టర్ నర్సింహారావు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా నివారణ టీకాలు వేయించాలని అబ్దుల్లాపూర్‌మెట్ పశువైద్యాధికారి డాక్టర్. సీహెచ్ నర్సింహారావు సూచించారు. ఈ నెల 15 నుంచి నవంబరు 14 వరకు టీకాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని పశువుల పెంపకందారులు తప్పనిసరిగా వాటికి టీకాలను వేయించాలని ఆయన సూచించారు.

● ఎల్బీనగర్ డీసీపీకి శుభాకాంక్షలు



ఎల్బీనగర్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బి.అనురాధను యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి కలిసి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.
-(ఎల్బీనగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి).

● జూబ్లీహిల్స్‌లో ప్రచారం



గడ్డిఅన్నారం డివిజన్ కాంగ్రెస్ నాయకుడు గండి జగన్‌యాదవ్ జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయనకు మద్దతుగా యూసుఫ్‌గూడ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు.
- (దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి)



అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి కవాడిపల్లి రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



ఇళ్ల మధ్యలో రక్షణ కంచె లేకుండా తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



అబ్దుల్లాపూర్ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను చుట్టేసిన చెట్ల పొదలు



ప్రమాదకరంగా విద్యుత్ తీగలను చుట్టేసిన చెట్ల పొదల తీగలు

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

● పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. చాలా చోట్ల రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు, చుట్టూ చిందరవందరగా విద్యుత్ తీగలు దర్శనమిస్తున్నాయి. మరికొన్ని చోట్ల ఫ్యూజ్ బాక్సులకు మూతలు ఊడిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. చాలాచోట్ల నేలపై తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడంతో పశువులు ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పెరిగిన చెట్ల పొదలు ట్రాన్స్‌ఫార్మర్లను కమ్మేశాయి. మరికొన్ని చోట్లా విద్యుత్ స్తంభాలపైకి ఎగబాకి విద్యుత్ తీగలను చుట్టేశాయి. వాటి నిర్వహణను విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పేదల ఆరోగ్యం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని, ప్రైవేటు ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకపోవడంతో అనేక మంది శస్త్ర చికిత్సలకు దూరమవుతున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఆరోగ్యశ్రీ సేవలు నిరాటంకంగా కొనసాగగా, ప్రస్తుతం ఆ సేవలు అరకొరగా అందుతున్నాయని ఆరోపించారు. మంగళవారం జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లు, జల్‌పల్లి మునిసిపాలిటీకి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే సబితారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆరోగ్యశ్రీ సేవలకు అంతరాయం కలుగకుండా చూడాలని, సీఎం సహాయనిధి ద్వారా ఎక్కువ మొత్తంలో బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బడంగ్‌పేట్, మీర్‌పేట్ శాఖల అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, అర్కల కామేశ్‌రెడ్డి, మీర్‌పేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ పంతంగి మాధవీవెంకటేశ్వరరావు, నాయకులు సిద్ధాల బీరప్ప, అబ్దుల్లా, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బొర్ర మాధవరెడ్డి, అశోక్, విజయ్, శ్రీనూనాయక్, సునీతా బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ల పెత్తనాన్ని సహించేది లేదు

కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్



కాలనీ సమస్యలపై కేఎల్లార్‌కు వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

సరూర్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లలో మాజీ కార్పొరేటర్ల పెత్తనాన్ని సహించేది లేదని, వారి బాధితులు ఎవరైనా ఉంటే నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని పలు కాలనీలకు చెందిన ప్రజలు మంగళవారం కేఎల్లార్‌ను పార్టీ కార్యాలయంలో కలిసి స్థానిక సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ ప్రాంతంలో నేటికీ మాజీ కార్పొరేటర్ల హవా నడుస్తుందని, ఏ పని కావాలన్నా వారిని కలవాల్సి వస్తుందని, అధికారులు సైతం వారి మాటే వింటున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కేఎల్లార్ మాట్లాడుతూ కాలనీల్లోని సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకునేలా అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీల ప్రతినిధులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు లాక్కెళ్లేందుకు యత్నం

● ప్రతిఘటించిన మహిళ ● పారిపోయిన ఆటో డ్రైవర్

సైదాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని ఆటో డ్రైవర్ తెంపుకొని పారిపోయేందుకు యత్నించాడు. అప్రమత్తమైన మహిళ ప్రతిఘటించి కేకలు వేయడంతో ఆటో డ్రైవర్ ఆమెను నెట్టివేసి పారిపోయాడు. ఈ ఘటనలో కిందపడ్డ మహిళకు గాయాలయ్యాయి. సైదాబాద్ ఎస్‌బీహెచ్ కాలనీలో మంగళవారం సాయంత్రం చిలువేరి సురేఖ(50) వాకింగ్ చేస్తోంది. కమ్యూనిటీ హాల్ వద్ద ఆటో నడుపుతూ వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి మహిళ మెడలో బంగారు గొలుసును తెంపుకొని పారిపోయేందుకు యత్నించాడు. మహిళ అడ్డుకుని గట్టిగా కేకలు వేసింది. దీంతో నిందితుడు మహిళను నెట్టేసి ఆటోతో పారిపోయాడు. ఈ ఘటనలో కిందపడటంతో మహిళకు గాయాలయ్యాయి. బాధితురాలి కుమారుడు ఫిర్యాదుతో సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెండ్రోజుల క్రితం మహిళ అదృశ్యం.. మీర్‌పేట్ చెరువులో మృతదేహం లభ్యం



కమల(ఫైల్)

సరూర్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మతి స్థిమితం సరిగా లేని ఓ మహిళ రెండు రోజుల క్రితం అదృశ్యమైంది. మంగళవారం చెరువులో మృతదేహమై కనిపించింది. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బడంగ్‌పేట్‌లోని సమతానగర్ కాలనీకి చెందిన ఎం.కమల(52) కొంతకాలంగా మానసిక రుగ్మతలకు చికిత్స పొందుతోంది. ఆదివారం సాయంత్రం ఆమె ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆమె ఆచూకీ కోసం ప్రయత్నిస్తుండగా మంగళవారం ఉదయం మీర్‌పేట్ మంత్రాల చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించింది. సదరు మృతదేహం కమలదిగా నిర్ధారించిన పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారమివ్వగా వారు వచ్చి ఆమెను గుర్తించారు. సంఘటనా స్థలం వద్ద శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

నేడు మలక్‌పేట కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

చాదర్‌ఘాట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం బుధవారం ముసారాంబాగ్ శ్రీపురం కాలనీలో గల రజక సంఘం భవనంలో నిర్వహించనున్నట్లు పార్టీ డివిజన్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్‌గౌడ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షకీల్ అహ్మద్ తెలిపారు. టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి మహారాష్ట్ర ఎమ్మెల్యే హమీద్ పటేల్ పార్టీ పరిశీలకునిగా విచ్చేయనున్నారని తెలిపారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వలీ ఉల్లా సమీర్‌తో పాటు మలక్‌పేట నియోజకవర్గంలోని డివిజన్ల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవుతారని ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మృతి చెందిన జంగయ్య

సంతోష్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సంతోష్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమన్‌గల్‌కు చెందిన జంగయ్య(60) భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 8న ఉదయం 9.30 గంటల సమయంలో సంతోష్‌నగర్‌లోని బాబానగర్ రాఘవేంద్ర టిఫిన్ సెంటర్ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సంతోష్‌నగర్ పోలీసులు 108లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ షేక్ వాజిద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి సబంధించిన వారు ఎవరైనా ఉంటే ఫోన్ నం.8712661296, 8712549697లలో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

బీసీల ఐక్యత చాటాలి: లింగంగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 18న జరిగే తెలంగాణ బంద్‌లో పార్టీలకతీతంగా సమస్త బీసీ శ్రేణులు పాల్గొని తమ ఐక్యతను చాటాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద వివిధ విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు బంద్‌కు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం అందరూ కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలు, వ్యాపార వర్గాలు, అన్ని వర్గాల ప్రజలు సహకరించి బంద్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు స్వామిగౌడ్, శ్రీకాంత్ యాదవ్, శ్రీనివాస్, సైదులు, రామకృష్ణ, వెంకట్‌గౌడ్, నరేష్, రాజుయాదవ్ పాల్గొన్నారు.



బస్తీ బాటలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, విద్యుత్ అధికారులు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి బస్తీ బాట

హయత్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో విద్యుత్ సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు హయత్‌నగర్ విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బస్తీ బాట కార్యక్రమాన్ని మంగళవారం హయత్‌నగర్‌లోని వినాయక్‌నగర్ కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి విద్యుత్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలవాసులు వివిధ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా ట్రాన్స్‌ఫార్మర్ అధిక లోడ్, లూజ్ వైర్లు, విద్యుత్ స్తంభాలు, త్రిఫేజ్ సమస్య, లోవోల్టేజీ సమస్య, వీధి దీపాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు ముందుకు రావడం మంచి విషయమని అన్నారు. కాలనీల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సబ్‌స్టేషన్ ఏఈ మిరాజుద్దీన్‌ఖాద్రి, లైన్‌మన్ యాదయ్య, జేఎల్ఎం దినేష్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుక్మారెడ్డి, ప్రవీన్‌గౌడ్, రవితేజ, మల్లికార్జున్, మురళీధర్‌రెడ్డి, సంజీవరెడ్డి, రాంరెడ్డి, యాదయ్య, పద్మారావు, వెంకట్‌రెడ్డితో పాటు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

● బీఎన్‌రెడ్డినగర్‌లో..



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్ నార్త్ కాలనీలో విద్యుత్ అధికారులు, సిబ్బంది పర్యటించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పోగులు రాంబాబు, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- వనస్థలిపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి)



ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీటీఐ అధికారులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కొత్తపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించడం చట్టపరమైన బాధ్యత అని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి అన్నారు. మంగళవారం రామంతాపూర్ జడ్పీహెచ్ఎస్ నుంచి 45 మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. సిబ్బంది రమేష్, సేఫ్టీ ట్రైనర్ ప్రవీణ్ నిబంధనలు పరిచయం చేసే రైమ్స్, యానిమేషన్ చిత్రాలనూ లెక్చర్ హాల్‌లో ప్రదర్శించారు. రంగుల బొమ్మలతో రూల్స్ పరిచయం చేసే ఏబీసీ ఆఫ్ రోడ్ సేఫ్టీ రూల్స్ బుక్‌లెట్స్‌ను పిల్లలకు అందజేశారు.